స్వెటర్లు పంపిణీ

ఎదులాపురం, నవంబర్ 14 : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణవాడ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో సామాజిక కార్యకర్త మానిశ్ రెడ్డి విద్యార్థులకు చలి నుంచి రక్షణ కోసం 100 స్వెటర్లు అందజేశారు. అంతకు ముందు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్లు శ్రీకాంత్ గౌడ్, సుజాత్ ఖాన్, శ్రీకాంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు స్వామి, ఫిరోజ్, మహేశ్, కళ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

భైంసా, నవంబర్ 14 : భైంసాలోని రాహుల్‌నగర్‌కు చెందిన వై బాబుకు సీఎం సహాయనిధి కింద రూ.25 వేలు మంజూరయ్యాయి. గురువారం బీజేపీ నాయకులు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, రాజు, లింగురాం పాల్గొన్నారు.

లంబాడీతండాను బాబెర తండాగా మార్చాలి

బోథ్, నవంబర్ 14: లంబాడీతండా గ్రామ పంచాయతీని బాబెరతండాగా మార్చాలని గ్రామస్తులు గురువారం ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతి పత్రం అందజేశారు. బాబెరతండాగా పిలిచే తమ గ్రామం పేరు రికార్డుల్లో లంబాడీతండాగా నమోదై ఉందన్నారు. బాబెర తండాగా మార్చాలని కోరారు.

సోయా కొనుగోలు నిలిపివేత

బోథ్, నవంబర్ 14: బోథ్ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న సోయా బీన్ కొనుగోళ్లను మూడు రోజులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 15న కార్తీక పౌర్ణమి, శని, ఆదివారం మూలంగా సోయా కొనుగోలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు. 18 నుంచి యథావిధిగా సోయా కొనుగోలు జరుగుతాయని పేర్కొన్నారు.

17న పెందూర్ వంశీయుల పెద్ద దేవుడు సమావేశం

ఇచ్చోడ, నవంబర్ 14: సిరికొండ మండలం కోసుపటేల్‌గూడలో ఈ నెల 17న నగేరా పెందూర్ వంశీయుల పెద్ద దేవుడు సమావేశం నిర్వహించనున్నట్లు కటోడాలు పెందూర్ ఆనంద్‌రావ్, పెందూర్ బండు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో వంశీయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి మహారాష్ట్ర వివిధ మండలాల నుంచి నగేరా పెందూర్ వంశీయులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో పటేల్ పెందూర్ సూర్యభాన్, జంగు, ఫిసట్‌రావ్, భీంరావ్, గంగారాం పాల్గొన్నారు.

యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి

నార్నూర్, నవంబర్ 14 : గాదిగూడ మండలం ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని తుడుందెబ్బ సంఘం నాయకులు మెస్రం శేఖర్‌బాబు, మడావి చంద్రహరి పిలుపునిచ్చారు. గురువారం లోకారి(కే) గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మెస్రం సోము, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయకులు మధు, శంభు, గోవింద్, దేవురావ్ పాల్గొన్నారు.

అదనపు బెడ్లు మంజూరు చేయాలి

బోథ్, నవంబర్ 14: సొనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు బెడ్లు మంజూరు చేయాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గాజుల పోతున్న, బత్తుల రమేశ్, అమృత్‌రావ్ పాటిల్, రమేశ్, తుల హరీశ్, సదానందం పాల్గొన్నారు.

గ్యాస్ భద్రతపై అవగాహన

భైంసా, నవంబర్, 14 : భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గ్యాస్ భద్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృప గ్యాస్ మేనేజర్ అజయ్ మాట్లాడుతూ గ్యాస్ భద్రత, పొదుపుపై ఎలా వాడాలన్న విషయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్, మేనేజ్‌మెంట్ సభ్యులు సత్యనారాయణ గౌడ్, అజిత్, రమేశ్ పాల్గొన్నారు.

న్యాయ సలహాలు, చట్టాలపై అవగాహన

సోన్, నవంబర్ 14 : సోన్‌లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సెక్రటరీ, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ రాధిక విద్యార్థులకు వివిధ న్యాయ సలహాలు చట్టాల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆరాధన, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సుజాత, లింగాగౌడ్, ఎండీ సిరాజ్ హైదర్, ముత్తన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం, నవంబర్ 14 : వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆదిలాబాద్ జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ సంద అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నవీన్ కుమార్, టీజీవో బాధ్యులు శివ కుమార్, రెవెన్యూ యూనియన్ సంఘం సభ్యులు, నాలుగో తరగతి యూనియన్ కార్యదర్శి ఇందిరా, టీజీవో యూనియన్ గౌరవాధ్యక్షుడు రాజేందర్ దేశ్‌పాండే, టీఎన్జీవోస్ బాధ్యులు , మహిళా ఉద్యోగులు సుజాత, రాధ, రజిని పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, నవంబర్ 14 : వికారాబాద్ జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ఉద్యోగులపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అధికారులు నల్లబ్యాడ్జీలు దరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గౌరవ వైర్మన్ లింగన్న, టీజీఈజేఏసీ జిల్లా వైర్మన్ ప్రభాకర్, నాయకులు లక్ష్మణ్, సాయన్న, రమేశ్ పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

సోన్, నవంబర్ 14 : సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామ శివారులో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం మండల వ్యవసాయశాఖ అధికారి వినోద్ పరిశీలించారు. రైతులు వేరుశనగ పంటను చీడ పీడలు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అండర్-17 బేస్‌బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక

లక్ష్మణచాంద, నవంబర్ 14: అండర్-17 రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు నాయక్ తెలిపారు. గురువారం నిర్మల్‌లో నిర్వహించిన బేస్‌బాల్ పోటీలో పాఠశాలకు చెందిన విద్యార్థులు కరుణ్, నిర్గున్ ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

నర్సాపూర్(జి), నవంబర్ 14 : కుస్లి గ్రామానికి చెందిన తోట రాజవ్వ, మానసిక దివ్యాంగురాలైన సునీతల ఇండ్లు కూలిపోయి అభాగ్యులుగా మారారు. ఈ విషయం తెలుసుకున్న సమత ఫౌండేషన్ వైర్మన్ సమత సుదర్శన్ గురువారం గ్రామస్తుల సహకారంతో కుటుంబానికి మూడు నెలల సరిపడా నిత్యావసర సరుకులతో అందించడంతో పాటు కూలిపోయిన ఇంటికి మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సమత ఫౌండేషన్ అర్గనైజర్ సాహెబ్ రావు, సీఈవో అనిల్ కుమార్, పీఆర్‌వో క్రాంతి కుమార్, సోషల్ మీడియా ఇన్‌చార్జి యోగేశ్ పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా
- అధికారులతో సమావేశం

ఎదులాపురం: మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, నవంబర్ 14 : ఈ నెల 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న టీజీపీఎస్ గ్రూపు-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీపీఎస్ గ్రూపు-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్లు, స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డీవో, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు గంటలకు పేపర్-2 నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తారని తెలిపారు. ఈ నెల 18న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎస్పీ గౌష్ ఆలయం మాట్లాడుతూ ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని, 144 సెక్షన్ అమలు, జిరాక్స్ సెంటర్లు మూసివేయడం, అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, అదనపు ఎస్పీ సురేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్‌సీవో అంతర్‌బేది, ఆర్డీవో వినోద్ కుమార్, జాయింట్ కస్టోడియన్, చీఫ్ సూపరింటెండెంట్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా నిరంతర సాధన చేయాలి

పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు అనవసర భయందోళనలకు గురికాకుండా ఏకాగ్రతతో చదువు కొనసాగించాలని, ఉత్తమ ఫలితాలు సాధించేలా నిరంతర సాధన చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఎంసెట్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఇక్కడ అందిస్తున్న వసతులు, విద్యా భోధన తదితర అంశాలను అడిగి తెలుసుకుని అధికారుల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ శిక్షణ సజావుగా సాగేలా నలుగురు అధికారులను కో ఆర్డినేటర్లుగా నియమించామని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి..

తాంసి, నవంబర్ 14: సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా చేపట్టాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫార్మాట్‌లో కుటుంబ సభ్యులను వివరాలు అడిగి సరిగా పూరించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో లింగయ్య, మండలాధికారులు, ఎన్యుమరేటర్, ఫీల్డ్ అసిస్టెంట్ పరంగత్ రెడ్డి ఉన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

భైంసా, నవంబర్ 14 : కుభీర్ మండలంలోని ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీయత్నంతో పాటు మరొకరి వద్ద నుంచి సెల్‌ఫోన్ చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను పట్టుకొని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ అవినాశ్ కుమార్ తెలిపారు. గురువారం భైంసా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చొండి గ్రామానికి చెందిన బీ శ్రీరన్ కుభీర్‌లోని కల్లు దుకాణంలో పని చేస్తుండగా ఈ నెల 12న ఇంటికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలోని ఇస్లాపూర్‌కు చెందిన తాడుల్‌కర్ లమన్, ఇంగోలీ ఆకాశ్, పవార్ ఓమ్ బైక్‌పై వచ్చి అతడిని బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. అదేరోజు బస్సు కోసం వేచి ఉన్న భైంసాకు చెందిన రాథోడ్ లలిత మెడలోనుంచి చైన్ స్నాచింగ్ కోసం ప్రయత్నించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కుభీర్ మండలం సేవదాస్ నగర్‌లో లమన్, ఆకాశ్‌ను పట్టుకున్నారు. మరో నిందితుడు ఓం పరారీలో ఉన్నాడు. ఈ కేసును చేధించిన సీఐ నైలు, ఎస్ఐ రవీందర్‌ను అభినందించారు. అంతేగాకుండా ఇటీవల ఆయా ప్రాంతాల్లో ఐదు ద్విచక్రవాహనాలను సైతం దొంగలించారని వాటిని స్వాధీనపరుచుకున్నామన్నారు. సమావేశంలో పట్టణ సీఐ గోపీనాథ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

లోకేశ్వరం, నవంబర్ 14 : నగర్ గ్రామంలోని నర్సింహస్వామి ఆలయంలో తాళం, జగదాంబ ఆలయంలో హుండీని అదే గ్రామానికి చెందిన మీసాలు ఎల్లాగౌడ్ దొంగతనం చేయడానికి ప్రయత్నించాడని ఆలయ పూజారి రామనుజ స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ఖానాపూర్ రూరల్, నవంబర్ 14: ఖానాపూర్ మండలం రాజురా గ్రామానికి చెందిన ద్యావత్ పొశెట్టి ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొశెట్టి ఎప్పటి లాగే పండించిన పత్తి పంటను ఇంట్లో నిల్వ చేశాడు. రాత్రి విద్యుత్ తీగలతో షాక్ సర్క్యూట్ మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 25 క్వింటాళ్ల పత్తితో పాటు డాక్యూమెంట్లు దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. ప్రభుత్వ స్పందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

గేదె దూడలపై పులి దాడి

ఖానాపూర్ రూరల్, నవంబర్ 14: ఖానాపూర్ మండలం రాజురా, బావపూర్ అటవీ శివారులో రెండు గేదె దూడలపై పులి దాడి చేసిందని పశువుల కాపరులు తెలిపారు. గ్రామంలోని భీమన్న గుట్ట వెనుక గల పెద్ద వాగు ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో పులి అరుపులతో వచ్చి మందపై దాడి చేసింది. ఈ దాడిలో పశువులు పరుగెత్తగా రెండు గేదే దూడలపై దాడి చేయడంతో గేదెలన్ని ఎదురుతిరుగబడడంతో పులి పారిపోయిందని పశువుల కాపరులు లావుడ్యా అర్జున్, గుగ్లావత్ రమేశ్, శంకర్, జైసింగ్ తెలిపారు. దాడి అనంతరం పులి బావపూర్ నల్లగుట్ట సైడ్‌కు వెళ్లింది. ఈ విషయమై ఎఫ్ఆర్వో కిరణ్‌ను అడుగగా గ్రామస్తులు గేదెలపై పులి దాడిచేసినట్లు తెలిపారన్నారు. రాత్రి కావడంతో పులి అడుగు జాడలు గుర్తించలేమని ఉదయం పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన ఒకరిపై కేసు నమోదు

ఎదులాపురం, నవంబర్ 14: ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్ విద్యార్థి కళాశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనంతో ఢీ కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన వినాయక చౌక్ నుంచి రవీంద్రనగర్‌కు ద్విచక్రవాహనంపై సామా అమరేందర్ రెడ్డి భార్య రాధికతో కలిసి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అజాగ్రత్తగా అతివేగంగా ఆశిష్ మరో ద్విచక్రవాహనంతో వీరిని ఢీకొట్టాడు. దీంతో భార్యభర్తలు కింద పడిపోయారు. గాయాలైన వీరిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. గురువారం అమరేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అశో కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శునకాల దాడిలో బాలుడికి గాయాలు

బేల, నవంబర్ 14 : పిట్‌గావ్ గ్రామంలో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వారం రోజుల్లో ఆరు గురిని కాటు వేయడంతో కుక్కలు కనిపిస్తే ప్రజలు వణికి పోతున్నారు. బుధవారం రాత్రి వికాస్ రాథోడ్ రోడ్డుపై ఆడుకుంటున్నాడు. ఈ సమయంలో కుక్కలు వచ్చి బాబుపై దాడి చేశాయి. ముఖం, తలపైన తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. వారం రోజులుగా పిచ్చి కుక్కలు దాడి చేస్తున్నాయని, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.

రైతు భరోసా నిధులు ఇచ్చే విధంగా కృషి చేయాలి

ఎదులాపురం, నవంబర్ 14: రైతులకు రైతు భరోసా నిధులు ఇప్పించే విధంగా శీతకాల సమావేశంలో అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు రవి, సుభాష దత్తు, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా లాహుజీ సాల్వే జయంతి

ఉట్నూర్‌రూరల్, నవంబర్ 14: హస్నాపూర్ గ్రామంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు లాహుజీ సాల్వే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బిరుదుల లాజర్, సంజీవ్, వసంత్, డిగంబర్ పాల్గొన్నారు.

జనరల్ స్టోర్ దగ్ధం

ఇంద్రవెల్లి, నవంబర్ 14: ఇంద్రవెల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గేట్‌కు ఎదురుగా ఉన్న మోతేవారం సంబాజీ, అమ్రపాల దంపతులకు చెందిన జనరల్ స్టోర్‌లో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో రూ.2 నుంచి 3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం సాయంత్రం దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లినారు. అర్ధరాత్రి జనరల్ స్టోర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక శాఖకు ఫోన్ చేసి సమాచారం అందించగా అగ్నిమాపక వాహన సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

నిర్మల్ అర్బన్: బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఎదులాపురం/బేల/బోథ్/ఇచ్చోడ/తలమడుగు/ఇంద్రవెల్లి/నిర్మల్‌అర్బన్/సోన్/దిలావర్‌పూర్/నర్సాపూర్(జి)/లోకేశ్వరం/ముధోల్/కుంటాల/ఖానాపూర్ టౌన్/ఖానాపూర్‌రూరల్/కడెం/దస్తురాబాద్, నవంబర్ 14 :బాలల దినోత్సవాన్ని ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు విద్యార్థులు సంప్రదాయ, ఆధునికతకు అద్దంపట్టే వేషధారణలో సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కొన్ని చోట్ల స్వయంపాలన చేపట్టారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరికొన్ని చోట్ల ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమ ఉద్దేశం, బాలల దినోత్సవ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు, వివిధ అధికారులు వివరించారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం

భైంసా: జెండాను ఎగురవేస్తున్న పీఏసీఎస్ వైర్మన్ దేవేందర్ రెడ్డి

భైంసా, నవంబర్ 14: భైంసాలోని మిర్జాపూర్ సహకార సంఘంలో గురువారం 71వ అఖిల భారత సహకార సంఘం వారోత్సవాలు నిర్వహించారు. సహకార సంఘం జెండాను పీఏసీఎస్ చైర్మన్ ఆమెడ దేవేందర్ రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ కార్యదర్శి రాజేందర్, శ్రావణ్, శివ, సురేశ్, సాయన్న పాల్గొన్నారు.

తానూర్, నవంబర్ 14 : తానూర్‌లోని హంగిర్గా సొసైటీ కార్యాలయంలో చైర్మన్ నారాయణ్‌రావు పటేల్ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌పటేల్, సోసైటీ డైరెక్టర్లు, సీఈవో భూమయ్య పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్, నవంబర్ 14: బజార్‌హత్నూర్‌లోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో నారాయణగౌడ్, డైరెక్టర్లు చట్ల వినిల్, రాజేందర్, దేవ్‌రావ్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తలమడుగు, నవంబర్ 14: సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు వారోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని సీఈవో మోతే శ్రీనివాస్ అన్నారు. 71వ సహకార సంఘాల వారోత్సవాలను పురస్కరించుకుని మండలకేంద్రంలోని కార్యాలయంలో జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సిబ్బంది సాగర్, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి సహకార సంఘం కృషి

ఇంద్రవెల్లి, నవంబర్ 14: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కృషి చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ మారుతిపటేల్‌డోంగ్రే అన్నారు. మండల కేంద్రంలోని సహకారం సంఘం కార్యాలయంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమ్ర కేశవ్‌రావ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, డైరక్టర్లు నిద్యాన్‌సింగ్, మధుకర్, పీఏసీఎస్ అధికారులు ధరమ్‌సింగ్, సునీల్‌కుమార్, లక్ష్మణ్, సురేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, నవంబర్ 14: మండలానికి చెందిన దుమాల శివన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట లింగారెడ్డి, నాయకులు ఉన్నారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు మరో నలుగురు న్యాయవాదులు

ఎదులాపురం, నవంబర్ 14: ఆదిలాబాద్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మరో నలుగురు న్యాయవాదులను న్యాయ శాఖ నియమించింది. ఉప న్యాయవాదిగా చంద్రకాంత్ చౌదరి, సహాయ న్యాయవాదులుగా తిలోత్తమ, జాదవ్ సంగీత, ఉప్పలంచి రూపేశ్‌ను నియమించారు. దీంతో డిఫెన్స్ కౌన్సిల్‌లో న్యాయవాదుల సంఖ్య ఏడుకు చేరింది. పేదలకు ఉచిత న్యాయ సలహాలు, సహాయం అందించడానికి వారిని నియమించారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే ప్రభాకర్ రావ్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు.

నర్సరీల పనుల పరిశీలన

దిలావర్‌పూర్, నవంబర్ 14: న్యూలోలం,సిర్గాపూర్, దిలావర్‌పూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న వనమహోత్సవం నర్సరీలను గురువారం ఎంపీవో గోవర్ధన్ పరిశీలించారు. నర్సరీల పనులను పరిశీలించి స్థానికంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. నర్సరీల్లో గ్రామానికి కావాల్సిన మొక్కలు పెంచాలని అందుకోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

పేదలకు దుస్తులు అందజేత

ఖానాపూర్, నవంబర్ 14: ఖానాపూర్‌లోని శాంతినగర్ కాలనీలో నిరుపేద కుటుంబాలకు జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 50 మందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు, మాజీ జడ్పీటీసీ రామునాయక్, అశోక్‌రావు, సుమిత్, శివకుమార్, శంకర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతోనే నేరాలు నియంత్రణ

ఖానాపూర్ టౌన్, నవంబర్ 14: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో నేరాలు నియంత్రించడంతో పాటు నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని డబుల్ బెడ్రూం నివాస గృహాల వద్ద ప్రజలకు సీసీ కెమెరాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ క్రైం వంటి విషయాలపై పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలి

పెంబి, నవంబర్ 14: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని ఎస్ఐ సాయికుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం వేడుకల్లో రోడ్డు భద్రతా నియమాలు, మాదక ద్రవ్యాల నిర్మూ